క్లుప్తంగా

వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక



జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు

పార్వతీపురంటౌన్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాల కడపలో 2023–24 అకడమిక్ సంవత్సరానికి 4, 5వ తరగతులలో బాల బాలికల ప్రవేశం నిమిత్తం ఈ నెల 24న ఎంపిక నిర్వహిచనున్నట్లు జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా బాల బాలికల జిల్లా స్థాయి ఎంపిక కార్యక్రమం ఈ నెల 24న స్థానిక బెలగాం ఆర్‌సీఎం స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. నాలుగవ తరగతిలో 20మంది బాలురు, 20మంది బాలికలు, ఐదవ తరగతిలో ఏడుగురు బాలురు , నలుగురు బాలికలు మొత్తం 51 ప్రవేశాలకు ఎంపికలు నిర్వహిస్తామన్నారు. 4 వ తరగతి ప్రవేశానికి బాల బాలికలు 1 ఆగస్టు 2023 నాటికి 8 సంవత్సరాలు వయస్సు పూర్తయి 9సంవత్సరాల లోపు ఉండాలన్నారు. 5 వ తరగతి ప్రవేశానికి బాల బాలికలు 1 ఆగస్టు 2023 నాటికి 9 సంవత్సరాలు వయస్సు పూర్తయి 10 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన వారు షెడ్యూల్‌లో పొందుపరిచిన విద్య, జనన, మండలస్థాయి డేటా షీట్‌తో హాజరు కాగలరని తెలిపారు. మరిన్ని వివరాలకు కె.గణేష్, హ్యాండ్ బాల్ కోచ్ – 9866805716, బి.రవి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ – 9666929309, బి.ఈశ్వర రావు, బాక్సింగ్ కోచ్-9908353692 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సర్పంచ్ మహేశ్వరరావు

గరుగుబిల్లి: 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రావుపల్లి పంచాయతీ సర్పంచ్ బి.మహేశ్వరరావు అన్నారు. మండలంలోని రావుపల్లి గ్రామ సచివాలయంలో సిబ్బందితో మంగళవారం సమావేశమై జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై చర్చించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వీలైనన్ని ఎక్కువ సర్వీసులు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దానికి అనుగుణంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పనిచేయాలని సూచించారు. గ్రామాల్లోని ప్రతీ ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వాటిని సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసి పరిష్కరించాలన్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువ పత్రాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.వెంకట సాయికృష్ణ, వీఆర్‌ఓ టి.శ్రీనివాసరావు తదితరులున్నారు.

నవధాన్యాల కిట్ల పంపిణీ



రైతులకు నవధాన్యాల కిట్లు అందజేస్తున్న ఏఓ ప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గొయిపాక రైతుభరోసా కేంద్రంలో 25 మంది రైతులకు మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ నవధాన్యాల కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. వర్షాలు అనుకూలంగా ఉండటం వలన ఈ విత్తనాలను పొలంలో వేసుకోవాలని సూచించారు. నవధాన్యాల సాగుతో భూమి సారవంతం అవుతుందని, ప్రధాన పంటలకు అవసరమైన అన్ని రకాల సూక్ష్మ, స్థూల పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని అన్నారు. ఫలితంగా ఏవిధమైన రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం ఉండదని, దిగుబడి కూడా పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో వీఏఏ కె.భవాని, సీఆర్‌పీ కె.మిన్నారావు తదితరులున్నారు.

ఆర్‌బీకేలకు చేరిన ఎరువులు



కొండాపురం ఆర్‌బీకేకు చేరిన ఎరువులు

పాలకొండ: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ కోసం ముందుస్తుగా ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేసింది. జిల్లాలో సుమారుగా 27వేల క్వింటాళ్ల వరి విత్తనాలు వ్యవసాయశాఖ అధికారులు అందించారు. ప్రస్తుతం ఎరువుల పంపిణీకి చర్యలు చేపడుతున్నారు. రైతుల డిమాండ్‌కు అనుగుణంగా డీఏపీ, యూరియా ఆర్‌బీకేలకు చేరుతున్నాయి. ఎరువులు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలని ఏఓ వై.వాహిని సూచించారు.

మట్టి పరీక్షలతో మేలు



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

- భూసార పరీక్షలతో రైతులకు అనేక ప్రయోజనాలు
- మట్టి నామూనాల సేకరణలో వ్యవసాయ సిబ్బంది
- ఫలితాలకు అనుగుణంగా ఎరువుల వినియోగం
- నేల సారాన్ని బట్టే దిగుబడి

గరుగుబిల్లి: నేల సారవంతం అయితే పంట బాగా పండుతుంది. అధిక దిగుబడులు వస్తాయి. మరి నేల సారవంతంగా ఉందో లేదో తెలుసుకోవాలంటే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. ఆ ఫలితాలకు అనుగుణంగా ఎరువులను వినియోగించడం ద్వారా నేలలో పోషకాల సమతుల్యత సాధ్యమై ఆశించిన దిగుబడులు వస్తాయి. మోతాదుకు మించి ఎరువులు వినియోగించడంతో సాగు ఖర్చు పెరగడంతో పాటు భూసారం దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలని నిర్ణయించింది.

మట్టి నమూనాల సేకరణ ప్రారంభం

ప్రస్తుతం కురుపాం నియోజకవర్గ పరిధిలో కురుపాం, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, జియ్యమ్మవలస మండలాల్లోని రైతుభరోసా కేంద్రాల పరిధిలో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది భూసార పరీక్షలు నిర్వహించేందుకు మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. గరుగుబిల్లి మండలంలోని 13 ఆర్‌బీకేల ద్వారా మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపారు. దీంతో పాటు భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్నారు. ఖరీఫ్‌లో పంటల సాగుకు ముందు ప్రతీ రైతు తమ పొలంలో మట్టి నమూనాలను పరీక్షించుకోవాలని సూచిస్తున్నారు. మండలంలోని ప్రతీ ఆర్‌బీకే పరిధి నుంచి 20 మట్టి నమూనాలను సేకరించి గరివిడి భూసార పరీక్షా కేంద్రానికి పంపుతున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ సారి కచ్చితమైన ఫలితాలు వచ్చేలా ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేశారు.

పోషకాల సమతుల్యతతో అధిక దిగుబడులు

పొలంలో సూక్ష్మ పోషకాలు లోపించకుండా రైతులంతా శ్రద్ధ తీసుకోవాలి. జింకు, బోరాన్, జిప్సమ్ లోపాన్ని సవరించడం వల్ల అధిక దిగుబడులు పెంచుకునేందుకు వీలుంటుంది. ఖరీఫ్ సాగుకు ముందుగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం మంచిదని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలతో లాభాలు

- నేలలో ఉన్న సూక్ష్మ, స్థూల పోషకాల స్థాయిని తెలుసుకోవచ్చు.
- మట్టి పరీక్ష ఫలితాలతో ఏ పంట వేయాలి, ఏయే ఎరువులు ఎంత మోతాదులో వేయాలనే విషయాలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది.
- పంట పొలాల్లో చౌడ ఆమ్ల స్థాయిని నిర్ధారించి దాన్ని తగ్గించేందుకు అవసరమైన యాజమాన్య పద్ధతులు పాటించే అవకాశం ఉంది.
- రసాయన ఎరువులపై అనవసర ఖర్చును తగ్గించుకునే అవకాశం ఉంది.

రైతులకు మేలు..



భూసారం బాగుంటేనే పంటల దిగుబడి బాగుంటుంది. వేసవిలో పచ్చిరొట్ట వంటి భూసారాన్ని పెంచే పంటలను సాగుచేసుకొని వేసవి దుక్కులు చేయడం మంచింది. రైతుల కోరిక మేరకు మట్టి నమూనాలు తీసుకుంటున్నాం. భూసార పరీక్షల కోసం రైతులు ఆర్‌బీకేలను సంప్రదించాలి.

– ఆర్.విజయభారతి, మండల వ్యవసాయాధికారి, గరుగుబిల్లి

నియామక పత్రాలు అందజేత



నియమాక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి మంగళవారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఎంపికైన వారికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నియామక పత్రాలు అందజేశారు. సక్రమంగా విధులు నిర్వహించాలని, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

పత్తి సాగు విస్తీర్ణం పెరగాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రబంధకులు షణ్ముఖరాజు

కురుపాం: మండలంలోని గుమ్మిడిగూడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు ప్రకృతి వ్యవసాయ విధానం, ప్రయోజనాలను రైతులకు వివరించారు. బీటీ పత్తి విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాన్‌బీటీ విత్తనాలు కూడా అధిక దిగుబడులు వస్తాయని అన్నారు. నాలుగేళ్లుగా గ్రామీణ వికాస్ కేంద్రం ద్వారా రైతులకు పత్తి విత్తనాలు సరఫరా చేయడమే కాకుండా, పండిన పంటను మార్కెట్ ధర కంటే అధికంగా చెల్లించి విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు చెప్పారు. పొలం గట్లపై ఆముదం, మొక్కజొన్న, జొన్న పంటలు, అంతర పంటలుగా కంది, బంతి, అలసందలు, పెసలు, మినుము పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. అనంతరం రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. జట్టు సంస్థ కోడైరెక్టర్ ఎం.నూకంనాయుడు, మండల ఇన్‌చార్జి ఎం.సీతారాం, ఎన్‌ఎఫ్‌ఏ జి.అన్నపూర్ణ, మాస్టర్ ట్రైనర్ నిర్మల పాల్గొన్నారు.

కనుల పండువగా జగన్నాథుని రథయాత్ర



వీరఘట్టం: జగన్నాథస్వామి ఉత్సవ విగ్రహాన్ని రథం ఎక్కించేందుకు తీసుకువెళ్తున్న అర్చకులు, భక్తులు



పాలకొండ: ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

పాలకొండ: జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సుభద్ర, బలభద్ర, జగన్నాథస్వామి విగ్రహాలను ప్రధాన ఆలయం నుంచి రథంపై ఊరేగింపుగా గుండిచా మందిరానికి తీసుకుచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పదిరోజుల పాటు ఇక్కడ స్వామివారు కొలువై ఉంటారు. వివిధ అలంకారాల్లో భక్తులు దర్శనమిచ్చి పూజలందుకుంటారు. పాలకొండలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్యే పాలవలస విక్రాంత్ జగన్నాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. యాత్రకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

– జియ్యమ్మవలస: మండలం చినమేరంగి గ్రామంలో జగన్నాథుని రథయాత్ర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన పూజారి ఎస్.గిరిధరపాత్రో ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

– వీరఘట్టం: మండల కేంద్రంలో ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో అర్చకులు లింగరాజ్ రథో స్వామివారికి విశిష్ట పూజలు చేశారు.

– భామిని: జగన్నాథ రథయాత్ర ప్రారంభం సందర్భంగా జై జగన్నాథ నినాదాలతో బత్తిలి హోరెత్తింది. హరేరామ నామ సంకీర్తనలతో భక్తులు స్వామివారి రథాన్ని లాగారు. పురోహితులు అర్జున సాహూ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను రథంపై ప్రతిష్ఠించి గుడించా మందిరానికి తీసుకువచ్చారు.

స్వామికి ఆభరణాల వితరణ

వీరఘట్టం: స్థానిక జగన్నాథస్వామి ఆలయానికి ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ రూ.1.60 లక్షలు విలువచేసే పంచలోహ కవచకుండలాలను అందజేశారు. రథయాత్రను పురస్కరించుకుని శర్మయాజీ దంపతులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి కవచకుండలాలు, శ్రీచక్రం, చేతితొడుగులను అంకరించారు.



జియ్యమ్మవలస: చినమేరంగిలో జగన్నాథుని రథయాత్ర



భామిని: బత్తిలిలో రథయాత్రలో హరేరామ సంకీర్తన బృందం భజనలు

కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలి



వైఎస్సార్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ శాఖలలో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ మేలు చేసేలా అందరినీ రెగ్యులరైజేషన్ చేయాలని పలువురు కాంట్రాక్ట్ అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. జూన్ 2, 2014 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తయి ఉండాలనే నిబంధనను సడలించాలని, ఆ రోజు వరకు పనిచేస్తూ, నేటికీ కొనసాగుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులతో త్వరలో ప్రభుత్వం ఒక సమావేశం ఏర్పాటు చేసి తమ అభిప్రాయాలను ఆలకించాలని కోరారు.

మట్టి అక్రమంగా తరలిస్తే చర్యలు

పాలకొండ రూరల్: మండలంలోని ఓని గ్రామ సమీపంలో ఉన్న బత్తులవాని చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న మట్టి తవ్వకాలను ఇరిగేషన్ డీఈఈ డి.రవికుమార్ మంగళవారి పరిశీలించారు. ఒక జేసీబీతో పాటు నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నారు. దీనిపై స్థానిక తహసీల్దార్ పి.సోమేశ్వరరావుతో పాటు గనులశాఖ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెరువుల నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టేవారిపై కఠినంగా వ్యవహరించాలని, మట్టి తరలిస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేయాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పాలకొండ రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పాలకొండ ఎల్ఐసీ కార్యాలయం(పాత ఆంధ్రా బ్యాంక్) వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఎస్.మన్మథరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాహనాల వేలం

పాలకొండ రూరల్: వివిధ కేసుల్లో సీజ్‌చేసిన వాహనాలను స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) కార్యాలయం వద్ద సూపరింటెండెంట్ సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం వేలం వేశారు. అక్రమంగా సారా, మద్యం తరింపు కేసుల్లో పట్టుకున్న 15 వాహనాలను వేలం వేయగా.. ఒక లక్షా 82వేల 536 రూపాయలు నగదు సమకూరినట్లు సీఐ గోపాలకృష్ణ తెలిపారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన 549.7 లీటర్ల సారాను ఈ సందర్భంగా ధ్వంసం చేసినట్లు అధికారులు చెప్పారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

పాలకొండ రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీస్ సిబ్బందికి సహకరించాలని ఎస్సై బి.శివప్రసాద్ కోరారు. పాలకొండ-వీరఘట్టం, సీతంపేట, శ్రీకాకుళం రహదారుల్లో మంగళవారం వాహన తనీఖీలు చేపట్టారు. బ్రీత్ ఎనలైజర్ పరికరంతో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించారు. సరైన వాహన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిపై అపరాద రుసుం విధించారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇస్తే వారి తల్లిదండ్రులు, వాహన యజమానులపై కేసు నమోదు చేయనున్నట్లు చెప్పారు.

సీఎం సభకు తరలిరండి



గుమ్మలక్ష్మీపురం: పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీపీ దీనమయ్య



కురుపాం: మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి పద్మావతి

గుమ్మలక్ష్మీపురం: అమ్మఒడి నిధుల విడుదలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 28న కురుపాం నియోజకవర్గానికి వస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. మంగళవారం తన ఛాంబర్ వద్ద పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై కార్యక్రమం ఏర్పాట్లపై చర్చించారు. ప్రతీ కార్యకర్త సీఎం సభకు హాజరుకావాలని సూచించారు. అలాగే సభకు హాజరయ్యే విద్యార్థులు, వారి తల్లులకు, పార్టీ అభిమానులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, ఎస్సీ, ఎస్టీ సెల్ మండల కన్వీనర్లు సామల మాధవరావు, తోయక గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: ఈ ఏడాదికి సంబంధించి అమ్మఒడి నిధులు విడుదల చేసేందుకు కురుపాం వస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలిరావాలని, సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత పిలుపునిచ్చారు. సభకు వచ్చేవారికి ఎటువంటిఆ అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో కురుపాం సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ ఆదిల్, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, ఎంపీటీసీలు గొడు సంతోషిరాణి, వెలమల బంగారునాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.గౌరీశంకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీలో నూతన విద్యావిధానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సింగిల్ మేజర్ సబ్జెక్టులపై ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం మంగళవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నూతన విద్యా విధానంలో భాగంగా ఈ ఏడాది నుంచి డిగ్రీ స్థాయిలో సింగిల్ మేజర్ విధానాన్ని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రవేశపెట్టిందన్నారు. ఈ విధానం ప్రకారం స్థానిక కళాశాలలో బీఏలో మేజర్ సబ్జెక్టుగా పొలిటికల్ సైన్స్, మైనర్ సబ్జెక్టు ఎకనామిక్స్‌ను, సీబీజెడ్ గ్రూపులో బోటనీ మేజర్ సబ్జెక్టు, కెమిస్ట్రీ మైనర్ సబ్జెక్ట్, ఎంపీసీఎస్ గ్రూపులో కంప్యూటర్ సైన్స్ మేజర్ సబ్జెక్ట్ కాగా, మ్యాథ్స్ మైనర్ సబ్జెక్ట్‌గా బోధన చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ విధానంలో మొదటి సంవత్సరం మాత్రమే చదివితే సర్టిఫికెట్, రెండో సంవత్సరం వరకూ చదివితే డిప్లమా సర్టిఫికెట్, మూడేళ్ల పాటు చదివితే బ్యాచిలర్ డిగ్రీ సర్టిఫికెట్, నాలుగో ఏడు కూడా కొనసాగితే డిగ్రీ ఆనర్స్ సర్టిఫికెట్‌ను విద్యార్థికి ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 19 నుంచి ప్రారంభమైందని, కళాశాలలోనే ఉచితంగా రిజిస్ట్రేషన్స్ చేస్తున్నామని, ఈనెల 24తో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఇతర వివరాలకు 9490459917, 8331817710 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

150 రోజులు పని కల్పించాలి



వేతనదారులతో మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

భామిని: మండలం అత్తికొత్తూరు కాలనీని ఐటీడీఏ పీఓ కె.కల్పనాకుమారి మంగళవారం సందర్శించారు. ఉపాధి పనుల నుంచి వస్తున్న వేతనదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. జాబ్‌కార్డులు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలను పీఓ పరిశీలించారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు గల గిరిజనులకు 150 రోజులు పని కల్పించాలని ఏపీఓ తులసీదాస్‌ను ఆదేశించారు. గ్రామంలోని వేతనదారులకు ఇప్పటివరకు కల్పించిన పనిదినాలు, బిల్లు చెల్లింపుపై వాకబు చేశారు.

ఖాతాదారుల భద్రత కీలకం



సెక్యూరిటీ సిబ్బందిని సన్మానిస్తున్న సీఐ, బ్యాంక్ అధికారులు

పాలకొండ రూరల్: నగదు సంబంధిత లావాదేవీల కోసం బ్యాంక్‌కు వచ్చిపోయే ఖాతాదారుల భద్రత కీలకమని పాలకొండ స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ హిమాన్ష్ బెహరా అన్నారు. సెక్యూరిటీ దినోత్సవాన్ని పురష్కరించుకుని బ్యాంక్‌లో సెక్యూరిటీ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న జి.శంకరరావు, జి.బాబురావు, ఏవీఆర్.మూర్తి, బి.రామారావు, టీఎస్.అప్పారావు, జి.లక్ష్మణరావులను మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న కాశీబుగ్గ సీఐ జి.శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ, ఇతర రంగాల్లో సెక్యూరిటీ సిబ్బంది నిర్వహించే విధులు వెలకట్ట లేనివన్నారు. ప్రక్రియలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయని తెగువ శ్లాఘనీయమని కొనియాడారు. రీజనల్ చీఫ్ మేనేర్ మురహరి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా భూముల రీసర్వే



రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వేకు భూ హక్కుదారులు, రైతులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. వీరఘట్టం రహదారిలో చేపడుతున్న రీసర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. బుధవారం సర్వే నంబర్ 434 నుంచి 436, 484లో సర్వే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సంబంధిత రైతులు పట్టాదారు పాసుపుస్తకాలతో హాజరుకావాలని సూచించారు. ఆయన వెంట మండల సర్వేయర్ పి.వెంకటరమణ, పి.సన్యాసిరావు, వీఆర్వోలు బి.సాయి శ్రీనివాస్, రామామరావు ఉన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

- డీఎల్‌పీఓ నాగభూషణరావు

కొమరాడ: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీఓ నాగభూషణరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్లు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.